


# పులిరఘుండీ

డప్పుల మోత యుద్ధ భేరీలాగ మోగుతోంది...

ధణకు ధణా.. ధణకుధణా.... ధణకుధణా...

అవి ఊరి కామందుల ఉక్రోషాలు... పెత్తనాలు... అజమాయిషీలు దర్పాలు..రోషాలు.. కావేషాలు.. అన్నీ ఉజ్జాయింపుగా యిమిడి దండోరాలో వినిపిస్తాంది. అది తరతరాలుగా ఏయే టికాయేడు ఆ చుట్టుప్రక్కల మార్మోగుతూనే ఉన్నది.

అది విన్నవారి గుండెల్లో ఒక అలజడి.. ఒక ప్రభంజనం... సంబరాలు చేస్తే అందరికీ సందడే... ఊరికంతా ఉత్సాహమే! అంతమట్టుకూ ఆకర్షణే... అది అన్ని ఊళ్లమాట...

కాని ముంగినాపల్లిలో మరిడమ్మ సంబరమంటే.. మంటే... ఆ మంట ఆ ఊరి మోతుబరుల మధ్యన రగుల్తుంది. కావేషాలు కచ్చల్లో ఉచ్చులు పోయిస్తాయి. కర్మకాలినోళ్ల కడుపుల్లో కసాలున కత్తులు దించుతాయి. పరదాచాటునున్న పోతరాలన్నీ ఒళ్లు విరుచుకుంటాయి.

మరి సంబరం కదా! అది సరదాల పంటగదా! ఇదేంటిట్టాని ప్రశ్నించినోళ్లకి - సరియైన జవాబు - ఆ ఊళ్లో జరిగే పులి వేషకాలపోటీ అని చెప్పక తప్పదు.

డప్పుల చప్పుళ్లు సమీపించేసరికి ముత్యాలు ఉలికి ఉలికి పడుతోంది. ఆమె మనస్సులో ఉత్పాతమేదో కలగలపుగా... మావఁని పిలవాలని రెండుసార్లాగింది. చివరికి ఉండబట్టలేక లేపాలని నులకమంచం దగ్గరకు నడిచింది.

కండపుష్టితో నల్లమద్దిమానులా నిగనిగ లాడ్తున్న రావుడు రాత్రి రెడ్డి కొలువునుండి వచ్చేసరికి ఆలస్యమైపోయింది. అందుకే ఒళ్లెరుగని నిద్ర. కాని, తనమావఁ ఆసాటింపు వినాలి. ఆడిలో ఉషారు పుట్టాలి.

కుదిపిలేపింది ముత్యాలు.

"ఏటే బంగారన్నాటి నిద్దర్ని పాడ్సేసావ్!" అని విసుగ్గా అటుతిరిగిపోయాడు.

"కాదు మావా! పులేసకాల పోటీకి సాటింపు ఏసినారు..."

"అవ్వి ఆవిటవిటకి అవుతున్నవే గందా! యింతగా సెబుతావేంటి? ఆల్లలా సాటించడవూ మామూలే! నేను తోకట్టుకోటవూమామూలే!" నిరాసక్తంగా అన్నాడు రావుఁడు.

"అలాగనకు మావాఁ! ఈ ఏడు ఎట్టాగయిననా ఏసకం కట్టాల..." అన్నప్పటికీ అతనిలో రవ్వంతయినా హుషారు పుట్టనందుకు తీవ్రంగా నొచ్చుకుంది ముత్యాలు. అతను ఎందు కట్లాగయినాడో ఆమెకు తెలియనిదికాదు.

రావుఁడికి రెడ్డి కొలువులో పని. తిరుగులేని వారిమాటకి తిరిగిచెప్పడు. అందుకే వాడినే రాచి రంపాన పెడతాడు. తనపట్ల నమ్మకం ఉందని చెప్పి తను పులేసకం వేస్తానని అన్నా సరే రెడ్డి, దుమ్మరాడితో పులివేషం వేయిస్తాడు. వాడి వెనకాల జెండీ పట్టుకోమంటాడు. నిజానికి పులివేషగాడి కంటే జెండీ పట్టుకున్న వాడిదే కష్టమంతా... ఆజెండీ బరువంతా.. చేతుల్లో ఇరికించుకుని, వెనకాలే బొంగరంమల్లే తిరగాలి. చేతులు రగిడిపోతాయి.కాళ్లు పీకేస్తాయి.మర్నాటికి బూరెల్లా పొంగిపోతాయి. తోకడాకూవాళ్లు బ్రాందీనో, కల్లో తాగుతూనే ఉంటారు. ముందున్న గురువుకీ, డప్పులోళ్లకి, రౌడీగాళ్లకి ఏవో ఒకటి అందుతూనే ఉంటాయి. కాని తోక పట్టుకున్న వాడిమాటే వాళ్లకి అక్కరలేదు.

"నీబాధ నాకర్థమైనాది మావాఁ! ఎప్పటిరెడ్డే... ఎప్పటిపనే... పేరాల్డి... పెతిష్టలాల్లవీను... బండసాకిరీలు నీవి.... మరి ఇట్టా ఏయేటికాయేడు వోయిదా ఏత్తున్నావు... కానీ ఈ సమచ్చరం నువు ఏసకం కట్టాల్సిందే..." గుండెలోంచి తడిమిన కోరిక గొంతులోంచి ఓ బంగారు పలుకయింది.

చప్పుడు చేసిన డప్పులు దాటినాయి.

చెప్పాలంటే ముత్యాలు మాటల్లో తిరకాసులేదు... నిక్కచ్చి నింపుగానే ఉన్నది. రెడ్డి కొలువులో అందరి పరిస్థితి అదే... అయితే వాళ్ల పరువు తక్కువ కాకూడదన్న తమ ఎక్కువ భావమే పెద్దోళ్ల పెత్తనాలను బతికిస్తూంది.

రావుఁడు లేచి ఇలా మొహం కడుక్కున్నాడోలేదో అలా రెడ్డి కబురు ఉన్నపళంగా రమ్మంటూ!!

"ఇయ్యేల యిజీనారం ఎల్లాల... పులిజండీలు తయారు సెయ్యించమని పొడుగు పాపారావుకి సెప్పి రావాల.. అట్నుంచటే రామారావుకి రంగులు బెత్తాయించమని సెప్పు... ఏసకాలు జిగేల్మనాలని సెప్పు..." అని రెడ్డి చెప్పటంతో పట్నం బయలుదేరాడు రావుఁడు.

విజయనగరంలో బొంకులదిబ్బ దగ్గర పొడుగు పాపారావు కర్రల కొట్టు ఉంది. దాని పక్కనే వ్యాయామశాల. అందులో కుర్రాళ్లకి కసరత్తులు, కుస్తీపట్లు మప్పుతుంటాడు. దీంతో పాటు సంబరాలకి పులివేషాలు, నాగినీ డాన్స్‌లకి కావలసిన సరంజామా అంతా సమకూరుస్తుంటాడు. సాయంవేళ్లలో స్టూడెంట్ కుర్రవాళ్ళకి పులివేషంలో తర్ఫీదు ఇస్తాడు. బజార్లో ఏ అల్లరొచ్చినా, జట్టీలయినా ఒక ఒడ్డు కాసేది అతడే !

అతని దగ్గరికి వెళ్లేసరికి మధ్యాహ్నామైపోయింది.

"ఏరా రామిగా! బుగత ఎట్లాగున్నాడు? మరిడమ్మ సంబరాలంటగందా!" వాడు ఎందుకు వచ్చాడో తెలిసినా అడగటం పరిపాటని అడిగాడు పాపారావు.

"ఈసారి కూడా తమరే పుల్జండీల్ని, మాంచి జిగీమానంగా సేసిపెట్టాలంట.. ఓసారి ఈల్చూస్కుని మావూర్రమ్మని రెడ్డి సెప్పినాడు". రావుఁడి మాటలు వినయంగా ఉన్నాయి.

అపుడే ఎదురుగా ఉన్న టీ కొట్టు కుర్రవాడు టీ తెచ్చి రావుఁడికిచ్చాడు. అతననే కాదు ఉదయం నుండి సాయంత్రం వరకూ పాపారావు దగ్గరకెవరొచ్చినా టీ తాగటం మామూలే. రంగుల రామారావు దగ్గరకి వెళ్లాలని లేచాడు. కానీ ఈ లోగా రామారావే వచ్చాడు.

"రామారావూ! ఈడు జండీల కోసరం నాకాడికొచ్చాడు. నీ దగ్గరకే రంగుల బెత్తాయింపుకి బయల్దేరాడు... ఏసకాలు బాగా కట్టాల"...పొడుగు పాపారావు చెప్పాడు.

"ఏమో క్రితం సారివాళ్ళు మునిస్వామిచేత వేయించుకున్నారు. మనకేల బాధ..." తనకేం పట్టనట్లు రామారావు చతికిలపడ్డాడు.

"అమ్మ అట్టాగనకండి బాబయ్య! గతేడు తవరు మెరక ముడిదాం పండక్కి ఎల్లినారని మీ కుఱ్ఱాడు భోగేసు సెబితేనే మునిసామిని పిలిచినాం... అంతేగాని మీరేసినట్లుగా రంగులు ఈ పట్నంలో ఎవురేస్తారు"... అన్నాడు ఎక్కడ కాదంటాడోనని.

రామారావు కొద్దిగా తేటపడ్డాడు. ఎందుకంటే ప్రతిసారి అతన్నే పిలుస్తాడు రెడ్డి. లోకరాజు మునిస్వామిని బెత్తాయిస్తాడు. ఈసారి బేరంకి కబుర్రాలేదేమాని అనుకుంటుండగా రావుఁడొచ్చాడు.

పులివేషాలకి రంగులు పులిమేది విజయనగరంలో ఇద్దరే రామారావు, మునిస్వామి. ఒకరు కట్టిన జట్టుకు ఒకరు కట్టరు. పై ఊరా ఎవరిష్టం వారిది...

"ఒరే కామిగా! పులి బుఱ్ఱలకోసం, బుజాల్రెక్కల కోసం నువ్వు సుంకరీది పకీరు కాడికి పోనక్కర్లేదు. రామారావే ఇస్తాడు. ఈ సుట్టు బెమ్మాండంగా ఉంటాయి. మీ ఏసకాలు"... అని రామారావు వంక చూశాడు పొడుగు పాపారావు.

"ఇదిగో! రావుఁడూ మీరెడ్డికి చెప్పు. వార్నీసుల్దరలు మండుతున్నాయి. మునుపటి లాక్కుదర్దు..." అన్నాడు రామారావు.

"రెడ్డి ఇయ్యనోడా ఏంటి... ఆల్ల ఏసకాలు బాగోవాలగాని..." రావుఁడు సర్దాడు.

అక్కడి తంతుపూర్తయింది. వాళ్లిద్దరికీ చెప్పి బయటపడ్డం పెద్ద రాతిమోత తప్పినట్లుగా అయింది రావుఁడికి.

బస్సు ఆగేవైపుకి రావుఁడు వెళుతుంటే లోకరాజు రైతు రంగిగాడు ఎదురై మీసాలు మెలేస్తూ" "ఈసారి మీరేదో కొట్టుకుపోదావని చూత్తున్నారుగాని. మేం రామతీర్తాల్నుండి వాకాడలచ్చయ్య గురువుగోర్ని తీసుకొత్తన్నాం. ఆయన పులేసకాల్లో పెద్ద సెయ్యి..." అనేసి వెళ్లాడు.

అదే సమయంలో లోకరాజు కొడుకు భీమరాజు బుల్లెట్ మీద వెళ్తూ గుఱ్ఱుగా చూశాడు రావుఁడిని.

ఇంటికి వెళ్లాక రెడ్డి దగ్గర విషయాలను పూసగుచ్చినట్లుగా వివరించాడు రావుడు. లోకరాజు రైతు రంగిగాడి కొవ్వుతేరిన మాటలు.. రెడ్డిని ఉడకబెట్టాయి.

★ ★ ★

తరువాత రావుఁడు ఇంటికి చేరగానే ముత్యాలు అడిగింది. "ఏటిమావాఁ! ఈ సుట్టయినా ఏసకం కట్టేదేమైనా ఉన్నదా! జండీ పొట్టుకు తిరగటమేనా!"

"ఏటే నాను కట్టేది... నా బొంద కాపోతే... మనబతుకులకి పెద్దోల్లకెదురు

సెప్పటమేటి... ఏసకం కట్టడం నాకిట్టం లేకనా!... జండీ ఒట్టుకోకుంటే రెడ్డినడ్డిరగ దీస్తాడు..." భయంగా అన్నాడు.

భర్త జడుపు ముత్యాలుకి బోధపడనిది కాదు.

రెడ్డి పులివేషం ఒకసారి ఓడిపోయింది. దానిక్కారణం జండీ పట్టుకోవటం బాగాలేకనే అని పులివేషగాడు చెబితే రెడ్డి రావుఁడి వీపు వాయగొట్టాడు. అదింకా తమకి గుర్తే.

పెద్దోళ్లతో పెంకితనాలు చేస్తే తమబతుకులు ఓటికుండలను పోల్తాయి...

"కాలం కలిసొత్తే తన మావఁపులేసకం కట్టడం కాయం." అనుకుని తాత్కాలికంగా తృప్తి పడింది ముత్యాలు.

మరిడమ్మ జాతర దగ్గరపడ్డాది.

ఈ మధ్య నీ మధ్య రెండుసార్లు పొడుగు పాపారావు పులివేషగాళ్లకి తర్ఫీదు ఇవ్వడానికి వచ్చాడు. వచ్చినపుడల్లా మందు, ముక్కలు వుండాల్సిందే! లేకపోతే అడుగులు పడవు. లోకరాజు పాలేరుగాళ్లకి మునిస్వామి శిక్షణ. వాళ్లీసారి పులిఝుండీలు విశాఖపట్నం నుండి తెప్పిస్తున్నార్ట. వాటి ప్రత్యేకతేమిటో సంబరంనాడు తప్ప తెలియకుండా జాగ్రత్త పడ్తున్నారు.

జాతరొచ్చింది. జనం... జనం.. అట్టహాసమంతా పెద్దలదే.

సంబరాలకి పోగయిన సొమ్ములో పెద్దమొత్తం పులివేషాలపోటీకి కేటాయిస్తారు. గెలిచినవారికి ఆ సొమ్ముముడుతుంది. పై పందాలజోరు ఎలాగూ ఉంటుంది.

మధ్యాహ్నానికి పులి వేషగాళ్లు రంగులు పులుము కోవటానికి కూర్చున్నారు.

రెడ్డిగారి పులేషగాడు దుమ్మరోడు చింతచెట్ల సత్రం దగ్గర రంగులు వేసుకునే ఏర్పాటు. రంగుల రామారావు పూటుగా తాగి పనిలో మునిగాడు. పిల్లకాయలు విరిగిన సత్రం గోడమీంచి తొంగితొంగి చూస్తున్నారు. వాళ్లని అదిలిస్తూ రావుఁడు కర్రపట్టుకుని అక్కడ్నే నించున్నాడు.

దుమ్మరాడి దేహదార్ఢ్యం మీద వార్నీసు అందాలొలుకుతూంది. తరువాత పట్నం నుండి పొడుగప్పారావు ట్రాక్టర్‌మీద ఝుండీలు తోలాడని తెలిసివెళ్ళి తీసుకువచ్చాడు రావుఁడు.

ఈసారి క్రితం సారి కంటే మరీ బరువనిపించాయి. ముచ్చి కాగితాలు ఎండపడి జిగేల్మంటున్నాయి... ఇదొట్టుకొని పులేషం ఎనకమాల గింగర్లు తిరగాలంటే ఒళ్లు

జలదరిస్తోంది.

దుమ్మరాడి పులేషకం పూర్తయ్యింది. టిఫిన్స్ తిన్నారు. రావుడికి పిసరంత పెట్లేదు. వాడికి కడుపు అంటుకుపోయి ఉన్నది. వాళ్లిద్దరూ తాగగా మిగిలిన టీ ఉంటే తాగాడు. సత్రం ముందరే డప్పులు కాల్చు పెట్టారు. బంగారిగాడు, తిప్పడు వాయించే డప్పులే పులేషకానికి ప్రాణం. ఆదరువుని బట్టే వేషం రక్తికడుతుంది.

పులిబుర్ర, భుజాలకి రెక్కలు తొడుక్కుని ట్రాక్టర్ మీదే మరిడమ్మ గుడిదగ్గరకి వెళ్లారు. అపుడే లోకరాజు పాలెకాపురాజప్పడి చేత వేషకం కట్టించి దణ్ణానికి వచ్చాడు మునిస్వామి.

రెండు పార్టీల వాళ్లు కోలాహలంగా డప్పులతో బయలుదేరారు. విజయనగరం నుండి పొట్టి అప్పారావుని, మన్మథ కుమార్‌ని న్యాయ నిర్ణేతలుగా పిలిచారు.

ఊరి నడిబొడ్డున పెదనారాయణస్వామి గారింటి దగ్గర ఆడతారు. లోకరాజు, రెడ్డి రచ్చబండ కెదురెదురు ఆసనాలు వేసుకున్నారు. దుమ్మరాడు కండలు కదిలిస్తున్నాడు. బుర్ర గజగజలాడిస్తున్నాడు. వాడెటుకదిల్తే అటు కదుల్తున్నాడు రావుఁడు. బంగారిగాడు, తిప్పడు దుమ్మరాడి ఆటకు మంచి ఊపునిస్తున్నారు. రెడ్డి సంతోషం అంతా ఇంతా కాదు.

రాజప్పడు కూడా శక్తికి మించి ఆడుతున్నాడు. చేతులు రెండూ క్రింద ఆనించి కొంతసేపు..., ఒకచేయిలేపి కొంతసేపూ ఆడాడు.

ఇంక ఆసక్తి కలిగించే ముఖ్యాంశాలు మొదలైనాయి. నీళ్ల బిందెను పళ్లతో పైకెత్తి చుట్టూ తిరగటం చిన్న పిల్లల నడుంకి తువ్వాలు చుట్టి కరిచి మీదికెత్తడం... నిమ్మకాయలను పడకుండా ఆడుతూ గెంతటం... చేతిలో కర్పూరం వెలిగించి బుర్రమాత్రమే గడగడ వణికిస్తూ నిలబడ్డం వగైరాలన్నీ చూపరులను విశేషంగా ఆకర్షిస్తాయి.

దుమ్మరాడు విజృంభించాడు. రాజప్పడులో అలుపు స్పష్టంగా కనిపిస్తోంది... ఝుండీ పట్టుకున్న వీరిగాడు శక్తి లేనట్లు పడిపోయాడు. అప్పటికే దుమ్మరాడు కర్పూరం చేతిలో వెలిగించుకుని బుర్రాడిస్తున్నాడు.

చప్పట్లు...చప్పట్లు... జనం కేకలు.

“దుమ్మరాడిదే గెలుపు...” నిర్ణయం జరిగింది.

“ఛీ! ఎదవా! నీ మూలకంగానే రాజప్పడు ఓడినాడు...”ముని స్వామి వీరిగాడిని

ఎడాపెడా వాయించాడు.

అరుపులు... కేకల్లు.... ఏదో ఒకవాగుడు అంతే ఎప్పటి మాదిరి ఘర్షణ... అసూయప్రజ్వలించి కార్చిచ్చులామారి...

ఎవరెత్తారో సోడాబుడ్లు... ఫటీల్ఫటీల్మని పేలాయి. రగతాలు కారాయి. కఱ్ఱలు లేచాయి.

జనం పరుగు... ఏడుపులు... పెడబొబ్బలు దొమ్మీ... పట్నం నుండి వచ్చినవారిని మాత్రం రెడ్డి తన కళ్లాల్లోకి చేర్చాడు.

శోభతో మొదలైన సంబరం క్షోభతో ముగిసింది.

ఆ తొక్కిసలాటలో రావుఁడి గురించి ఎవరికీ పట్టలేదు. వాడిని ఒక ఒడ్డుకి లాగాలని ఏ ఒక్కరూ చూడలేదు.... చివరికి వాడిని ఓ అమృత హస్తం ఆదుకుంది.

అది అతని భార్య ముత్యాలిదని కళ్ళు తెరిచిన దాకా తెలియదు.

"ఎవరి మూలకంగా ఆల్లు గెలిసారో ఆల్లకక్కర్లేదు.... ఎంతసేపూ ఆల్లపరువులు పెటిట్టలే... నువ్వు దెబ్బతింటే కనికరం సూపారాని? నువ్వు జండీ ఒట్టుకున్నా ఈ జట్టీలు, యుద్ధాలు తప్పనపుడు... పులేసకం ఏయడానికి నీకు బితుకేంటని.." ఈ సారి చెడామడా తిట్టి పారేసింది ముత్యాలు.

తన సుఖం కోరేది భార్య.. అందుకే రక్షించింది. ఆమె చెప్పే మాటలు గాలికెగిరిపోయే దూదిపింజలు కావు. ఇంత కాలమై తనలో కోరిక తనలోనే ఇమిడి పోయింది. కానీ ఈ సారి అలావల్లకాదు. తనువోచ్చీ ఏడయినా పులేసకం కట్టాల్సిందే!

ఆరోజు నుండీ రావుడి వన్నీ రంగుల కలలే! కాలం గిర్రున తిరిగేదెంతసేపని?? ఇంక రెండు నెలల ఊసు. ఎప్పటి దండోరావే... ఎప్పటి పోటీవే...!

రావుఁడి కోరిక బోర విరిచింది.

రెడ్డి కళ్లంలో పనిచేసేటపుడు అందరినీ తనవద్దకీ రప్పించాడు. అప్పుడు భయం భయంగానే అన్నాడు రావుఁడు. "రెడ్డిబాబూ! నాను ఈ ఏటికి పులేసకాల పోటీలో...." ఇంకా మాట మిగిలేఉంది.

ఆగి ఆగినవ్వాడు రెడ్డి.. గుంపంతా నవ్వింది.

"పులేసకానికి జండీ వొట్టుకుని తిరిగేటోడివి నువ్వు ఏసకం ఏత్తావా! ఎవుడైనా వింటే నవ్విపోగల్డు... బర్లోకి దిగడమంటే మాటలనుకున్నావా! పైగా మనమీద ఆశతో పందాలు కాసుకునే వోల్లమాటేటి" రెడ్డి చెప్పాక నవ్వాడు మరోసారి.

నవ్వినోళ్లు నవ్వారు. కిక్కురుమన్లేదు రావుఁడు.

ఈ సారికి కూడా దుమ్మరాడ్నే పెట్టాడు. వాడికేదో వాతం లేచిందనంటే పట్నం నుండి ఖరీదయిన ఇంజక్షన్లు రావుడి చేతే తెప్పించాడు రెడ్డి.

"రెడ్డలాగన్నాడు గాని... నీకేటి తక్కూ అని... నల్లసానపు రాయిలాటి శరీరముంది... సురుకుంది... అంతకంతా తరిపీదు పొందినావు.. ఎపుడూ జండీ పొట్టుకోవటమేనా !!"

ముత్యాలుకి తను జవాబివ్వలేనని రావుడికి తెలుసు.

"నువు జండీ పొట్టుకోటాన్కి ఈల్లేదు... అల్లసావేదో ఆల్లేసత్తారు. రెడ్డి కాడ కూలికి కుదిరింది. కడుపునింపుకోటానికే గాని జండీ లొట్టుకోటాన్కిగాదు... ఈ సంగతి సెప్పెయ్యి..." అని తెగేసి చెప్పేసింది.

అయినప్పటికీ ధైర్యం చాల్లేదు రావుఁడికి. మర్నాడు కొలువుకి వెళ్లాడు.

"ఏరా! నువ్వేదో అన్నావని బుగత చిరుబురులాడ్తన్నాడు. వారంనేదు పండగ... జండీలకోసం అప్పారావుకాడకి ఎల్లాలంట... రంగుల రామారావు పోయినాడంట... ఆల్లకొడుకే రంగులేత్తాడంట... ఆడికే సెప్పి ఒప్పించాల... ఇన్ని పన్లు నీమీదెట్టాడు.. ఈసాయంత్రానికి ఎల్లాలి..." దుమ్మరాడు చెప్పాడు.

రెడ్డి మాట తప్పగలడా! విజయనగరం బయలుదేరాడు.

మొదట రంగుల రామారావు కొడుకు భోగేశుని కలసి విషయం అంతా చెప్పి బయానాగా కొంత ముట్ట చెప్పాడు.

చిట్టచివర పొడుగు పాపారావు కోసం బొంకుల దిబ్బవైపు వెళ్లాడు.

ఆ మాట ఈ మాట చెప్పాక "ఈసారి నువు ఎయ్యలేక పోయినావా! నీకు సొమ్ము కలిసొచ్చేదికదా!" టీ తాగుతుంటే పొడుగు పాపారావు రావుఁడిని కదిపాడు.

రెడ్డిని తనడిగిన విషయం చెప్పి"! నాకా అదృట్టవా! అయినా ఎవురాడినా డబ్బులు ఆల్లవేగందా. మన సేతుల సిక్కుతాయా ఏంది? మనకి సోడానీల్లే గతి..." బరువుగా ఊపిరి వదిలాడు రావుఁడు.

పొడుగు పాపారావుకి అయోమయమైంది. ప్రజల చందాలు పోగుచేసి పెడితే పులివేషగాళ్లకి కాకుండా తామే స్వాహా చేస్తున్నారన్నమాట ఎంతఘోరం!

"ఒరే నీకు సర్దా ఉంటే ఈ పాలిపులేసకం కద్దూగాన్లే.." అని చిన్న ధైర్యం చెప్పి పంపాడు రావుఁడ్ని. ఆ సాయంత్రానికే కాదు మర్నాటికి కూడా రావుఁడిల్లు

చేరకపోవటంతో కంగారెత్తిపోయింది ముత్యాలు.

రెండు మూడు సార్లు రెడ్డి నుండి కబురొచ్చింది.

ఇంక రెండురోజులే ఉంది సంబరానికి. "పొడుగప్పారావు దగ్గర్నుండి అయెనకాలే బయలెల్లి వొచ్చేసినాడంట. ఆడేడకుపోయాడో నీకు తెల్వకుండా ఉంటాడా!" రొక్కించి అడిగారు.

దేవుళ్లందరి మీదా ఒట్లు పెట్టిమరీ చెప్పింది తెల్వదని. ఆ రోజే మరిడమ్మ సంబరం.

దుమ్మరాడి పులేసకానికి జండి పట్టుకునేవాడు కరవైనాడు. చివరిక్షణం వరకూ చూశారు. రావుఁడయిపులేదు. మరెవరిననో పెట్టుకున్నారు. వాడిచేత కాని తనం వల్లనే ఓడిందని రెడ్డి అభిప్రాయం. లోకరాజు మనిషి రాజప్పుడి పులివేషం నెగ్గింది.

సంబరం మరోసారి విధ్వంసదృశ్యాల్ని తిలకించమని ప్రజల్ని కోరింది.

రెడ్డి కోపం అంతా ఇంతా కాదు. మనుషుల్ని రావుఁడింటి మీదికి ఒదిలాడు. వాళ్లు ముత్యాల్ని లాక్కువచ్చారు.

"నీ పెనిమిటిని పులేసకం ఏయిపించలేదని ఎక్కడో నక్కేస్తాడా... ఆడ్రానీ కండకండాలుగా సేత్తా... ఆడిమూలకంగానే ఈసారి ఓడినాం..." రెడ్డి ఉగ్రంగా అన్నాడు.

"ఈ పాలైనా తమకి ఆడిలువ తెల్సినాది అంతే సాలు బాబూ! లేకపోతే సంబరం రోజున గుక్కెడు నీల్లయిననా పోత్తున్నారా! కడుపుల్నకనకలాడిపోయినా మీ మంచి కోసవే ఆడు జండీ వొగ్గకుండా ఉండీవోడు" దెప్పినట్లు అన్నది ముత్యాలు.

అదే రెడ్డికి మంటెత్తించింది. దాని ఫలితం.

ముత్యాలి ఒంటిని దుమ్మరాడి చేతులు రాక్షసంగా తాకాయి. ఆమె పరుగెత్తింది. అయినా తరిమితరిమి ఆమెను దక్కించుకున్నాడు.

దుఃఖితురాలై గడపచేరిన ముత్యాలు రావుఁడ్ని చూడగానే కరుచుకుపోయింది. తననెవరో అపరిచిత వ్యక్తులు కారెక్కించి రెండ్రోజులపాటు ఓ గదిలో పడేశారని చెప్పగా విలవిలలాడిపోయింది ముత్యాలు.

తన భార్యకు జరిగిన అవమానానికి ఉగ్రుడైపోయిన రావుఁడు వెంటనే రెడ్డింటికి పరుగు దీశాడు.

ఆవేశంతో అంతెత్తున ఎగరాలని చూసిన రావుఁడ్ని చూస్తూనే గాలి దుమారంలా లేచాడు రెడ్డి. "నీ చేత ఏసకం ఏయిప్పించలేదని కుల్లెట్టుకోని టౌనెల్లి దాక్కుంటావురా...

ఈ సంగతి నీ పెళ్లానికి దెల్వదా! బంచెత్.." రెడ్డి పాదమెత్తి గుండెలమీద తన్నాడు.

రెండడుగులు ఎగిరిపడ్డాడు. అంత ఆక్రోశం గుండెల్లో నొప్పికి అడుగంటిపోయింది. రెడ్డి కాళ్లే శరణ్యమైనాయి. ఒకంతట వదల్లేదు. ఇంటికెట్టా చేరాడో తెలియదు రావుడికి.

ఊరినెదిరించలేని వాళ్లా రాత్రికి రాత్రే ఊరిడిచిపెట్టి పోయారు. అంతకంటే తిరుగుబాటు వారికి తెలియదు మరి.

గతాన్ని నెమరువేసుకోవడానికి రోజుల్ని చెరిపేసుకుంటూ చకచక చరిస్తొంది కాలం...

అందులోంచి సంవత్సరం తర్వాత తొంగిచూస్తే....

"ఇయ్యేడు పొడుగప్పారావు పులేసకాల పోటికీ కట్టిస్తున్నాట్ట." ఎక్కడ చూసినా ఇదే మాట.

ఎన్నడూ ఊరివాళ్లమధ్యే పోటీ ఉండేది. కానీ పట్నం వాళ్ళు పోటీలో కల్పించుకోవటం ఇదే ప్రథమం. రెడ్డికీ, లోకరాజుకీ మహ అక్కసుగా ఉన్నది. పట్నం వాళ్లని అట్నుంచటే తిరగ్గొడదామనే చూసారు. కానీ పొడుగప్పారావుతో పేచీ పెట్టుకుంటే సంబరం జరగటమే కష్టం. తమ పులేషకాలకి సరంజామా సమకూర్చేది వాళ్లే కాబట్టి..

అసలు రెడ్డికీసారి పోటీలలో గెలవటం మహకష్టమనిపిస్తొంది. కారణం దుమ్మరాడు ఈ మధ్య జబ్బుచేసి చచ్చిపోయాడు. రావుడు ఊరొదిలి వెళ్లాడు.. తర్వాత అంత బాగా పులేసకం కట్టేవోడు ఈనాడు వీధుల్లో ఎవరూ కానరావటం లేదు. పుల్లిగాడు ఓపిసర్నయం.

వాడికీ వయస్సు నలభైదాటింది. ఈ మధ్య తర్ఫీదు కూడా లేదుట. ఎప్పుడో ఇరవై సంవత్సరాల క్రితం విజయనగరం పైడితల్లి అమ్మోరి పండక్కి లంకవీధి వాళ్ల వేయించారట. మరల ఇప్పుడే... అదీ రెడ్డి మాట కొట్టలేక వూంకొట్టాడు.

ఇంక లోకరాజుకి మహాదానందంగా ఉంది. ఈపరిస్థితుల్లో రెడ్డి పులేసకం మీద రాజప్పుడు మెడ్డుకు రావటం ఖాయం.

అయితే భయమల్లా పట్నం నుండి వచ్చే పొడుగు పాపారావు పులివేషం గురించే.. అతని మప్పుబడిలో తయారైన వాడంటే ఆషామాషీకాదు.. అందునా పాపారావు ఎంపిక చేసిన మనిషి. ఈ భోగట్టాయే అందర్నీ చకితుల్ని చేస్తొంది.

దీనికి స్పందించే ఈ సారి పోటీలు మరింత రంజుగా సాగుతాయని కాబోలు

ప్రజలు దండిగానే విరాళాలిస్తున్నారు.

ఈ సంవత్సరం పోటీలకి రామతీర్థం నుండి వాకాడ లచ్చయ్యను, బిళ్ళల వలస నుండి బుద్ధరాజు సన్యాసిరాజుగార్ని న్యాయనిర్ణేతలుగా పిలిపించారు.

ఆరోజే మరిడమ్మ ఉత్సవం.

మధ్యాహ్నానికి ఏకంగా వేషం వేయించి తన పులివేషాల్ని ట్రాక్టర్లో తీసుకొచ్చాడు. పొడుగుపాపారావు. ఇంక బరిలోకి దిగటమే తరువాయి.

విజయనగరం నుండి లారీడు జనం చూడ్డానికి దిగారు. ఈ సారి ఏ అల్లర్లు అవకతవకలు జరక్కుండా వాళ్ళు బందోబస్తుతో సిద్ధంగానే ఉన్నారు.

మరిడమ్మ గుడి దగ్గర ట్రాక్టరాపించి వేషందించి దణ్ణాలు పెట్టించాడు. పులిఝుండీకి నెమలిఈకలు చుట్టూరా అతికించడంతో మరీ అందంగా ఉంది. అయితే ఝుండీ పట్టుకున్నది ఆడమనిషి... ఇది అందరికీ మరీ విడ్డూరమైంది.

సుంకరవీధినుండి డప్పు చరుపుకి వొచ్చిన కన్నిగాడు, ముంగిగాడు ముందర సిద్ధంగా నిల్చున్నారు.

బరిలో పుల్లిగాడు - రాజప్పడు - పాపారావు మనిషి ముగ్గురేముగ్గురు వున్నది..

ఇంక చూసుకోండి జనం గొడవ... డప్పులు అదరగొడ్తున్నాయి. పాతవేషాలు పాతవేషాలే. కొత్తమీద మోజు ఎక్కువగా ఉన్నది. పైగా ఆడమనిషి ఝుండీ పట్టుకోవటంతో జనమంతా అక్కడే పోగవుతోంది.

వివిధ లయవిన్యాసాలతో డప్పులమోత...

ఈ సారి ఎవరెక్కువ సేపు ఆడతారో చూశారు. భంగిమలు పరీక్షించారు. ఝుండీవాడి అలుపు సొలుపులు తెలుసుకున్నారు. బరువెత్తడాలు, నిమ్మకాయ నెత్తిమీద పెట్టి జారకుండా తిరగటం... అరచేతుల్తో పైకి లేవటం.... ఇంకా ఎన్నో కొత్త కొత్త పరీక్షలు...

పుల్లిగాడు మొదటే అలసి పక్కకి తొలగిపోయాడు. రాజప్పడు బిందె పట్టుకుని లేపేసరికి పన్నువిరిగి బొక్కబోర్లాపడ్డాడు.

ఇంక మిగిలిందీ, గెలిచిందీ పాపారావు మనిషే. చప్పట్లు... సందడి... గోల... కోలాహలం. ఎవరో అయిదురూపాయల నోట్లదండ వేసారు. కొందరు పూలహారాలు వేసారు.

రెడ్డి, లోకరాజు జనంలోంచి మాయమవడానికి దారివెతుక్కుంటున్నారు. పొడుగుపాపారావు మనుషులు ఏ రాద్ధాంతాలు జరక్కుండా మైకు పట్టుకుని జనాలను హెచ్చరిస్తున్నారు.

రెడ్డి, లోకరాజులను అటకాయించి డబ్బుఇమ్మని నిలదీశాడు పాపారావు. మాకు తెలియదంటే మాకు తెలీదని నాన్నారు. అంతే పాపారావు మనుషులు చేతిలో చైన్లతో దిగారు.

రెడ్డి మనుషులు కొందరు జబర్దస్తీ చేయబోయారు. అయితే అక్కడికక్కడే అణిచేశారు.

ఈసారి సంబరాలకి పోగయిన సొమ్ము ఇరవైవేలు గెలిచిన పులేషగాడికి ఇవ్వాలి.. ఇది అందరూ ఎరిగినదే!?

పొడుగు పాపారావు రెడ్డినీ, లోకరాజునీ చెరోవైపు లాగి చొక్కా గుంజాడు.

"ఈ యేడు సంబరంలో గెల్చినోడు ఎవుడో తెల్సా... మరెవరో కాదు. నీ దగ్గర కుక్కనాగబతికి, ఏషకానికి పులిఝండీ పొట్టకు తిరిగేవోడు.. నిన్నెదిరించనేక వూరొదిలి ఎల్లిపోనాడే.. ఆడే రావుఁడు" అనేసరికి జనమంతా నిర్ఘాంతపోయారు. రెడ్డి దిమ్మెరపోయాడు.

ఏడాదిక్రితం రెడ్డిచేత దెబ్బతిన్న రావుఁడు పట్నం చేరి పొడుగుపాపారావును ఆశ్రయించాడు. తమ వూరిలో సంబరం పేరుతో జరుగుతున్న అరాచకాల గురించి వివరించాడు.

జనం దగ్గర దండిన సొమ్మును గెలిచినవాడికి ఇస్తున్నట్లుగా జనాన్ని కనికట్టు చేసి తమ బొక్కసంలోకి తోసెయ్యటం. తరువాత ఓడిన వాళ్ళు అసూయతో విధ్వంసం సృష్టించటం మామూలైపోయింది. ఇవేవీ తెలీని వెర్రికుట్టెల్లాంటి ప్రజలు సంబరంలో పులివేషకం కట్టడమంటే ప్రాణాలకెదిరించటమే అనుకున్నారు. ఒకవేళ ఎవరైనా తెగించి బరిలోకి దిగినా వాళ్లకు నూకలుండేవి కావు.

పై విషయాలకే పొడుగు పాపారావు తీవ్రంగా స్పందించాడు. అందుకే రావుఁడు చేత వేషం వేయించి పట్నం నుండి పోటీకి పంపుతున్నట్లుగా కబురు పంపాడు. రావుఁడు గెలుపు పెద్దోళ్లకి చెళ్లుమన్న కొరడా చరుపు కావాలనుకున్నాడు. తనకు తెలిసిన ఈ విషయాలను పొడుగు పాపారావే మైకులో కేకేసి మరీ చెప్పాడు.

రెడ్డి, లోకరాజు వాళ్ల తరపు మనుషులు అడ్డంగా దొరికిపోయారు. అపుడు

సోడాబుడ్లు పగల్లేదు. కర్రల్లేవలేదు. రగతాలు పారలేదు. ఏడుపుల్లేవు... భయభ్రాంతులు లేవు.

విషయం విన్న ప్రజలు రెడ్డి, లోకరాజు మీద రాళ్ళు రువ్వలేదు... కర్రలెత్తలేదు.

పొడుగుపాపారావు బలవంతంగా ట్రాక్టర్లో వాళ్ళిద్దరినీ ఎక్కించాడు. మంగలి చంద్రయ్య చేత జుత్తు గొరిగించాడు. దానిమీద చుక్కలు సరేసరి. ఆక్షణం ఆ ప్రజలలో కొందరి విప్లవం వాళ్లమెడలో చెప్పులదండగా మారింది. ఇంకొకరి విప్లవం కోడిగుడ్ల విసుర్లుతో బహిర్గతమైంది.

మరికొందరి తిరుగుబాటు పేడముద్దల సత్కార రూపం దాల్చింది. అది చాలదూ.. జీవితాంతం జీడిమరకలా.. ట్రాక్టర్ బండ పురుగులా నడుస్తూంది

ఈలలు, కేకలతో ట్రాక్టర్ ముందు రావుఁడి పులివేషం.

అతని వెనకాల ఝుండీ పట్టుకున్న ఆడమనిషి ఎవరోకాదు...

రావుఁడి పెళ్లాం ముత్యాలు ...!

అదీ సంబరమంటే... !!

(సుప్రభాతం వార పత్రిక 23-8-1998)